జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 18 | సెప్టెంబర్ | 2025 ◆ పేజీలు : 8



## విద్యార్థులకు... నాణ్యమైన విద్య

- విద్యారంగంలో సమూల మార్పుకు కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం
- గిరిజన విద్యార్థులు అత్యుత్తమ లక్ష్యాలను సాధించాలి
- పారిశ్రామిక రంగాల అభివృద్ధికి రహదారులు కీలకం
- మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీతో ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు... రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేతశాఖ మంత్రి తుమ్మల
- విద్యార్థులు క్రీడలు సాంకేతిక రంగాల్లోనూ రాణించాలి
- గిరిజన విద్యార్థులు ప్రభుత్వ సహకారంతో ఉన్నత విద్యను అభ్యసించాలి... ఎమ్మెల్యే జారె
- తల్లితండ్రుల త్యాగాలను మరవకండి... కలెక్టర్ జితేష్ వి పాటిల్



2 లో...





## కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం




- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల
- ప్రజా పాలనలో ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యం
- రైతు సంక్షేమానికి తెలంగాణ కేరాఫ్ గా నిలుస్తోంది
- అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసమే కుల గణన
- ప్రజా పాలన దినోత్సవం వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల

7 లో...

## బీజాపూర్ లో ఎన్ కౌంటర్

- ఇద్దరు మావోయిస్టులు మృతి
- మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం
- ఆయుధాలు పేలుడు పదార్థాలు ఇతర సామాగ్రి స్వాధీనం
- కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్

2 లో...





## వామ్మో కొత్తగూడెం-ఇల్లందు రోడ్డు

- గుంతల రోడ్డు, గుండెల్లో భయం
- రాకపోకలు సాగించ లేక ఇబ్బందులు పడుతుతున్న ప్రయాణికులు, ప్రజలు
- తాత్కాలిక పనులు మూన్నాళ్ళ ముచ్చటగానే
- ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలు లెక్కలేవా.?

2 లో...

## నూతన బస్టాండ్ నిర్మాణానికి మోక్షం ఎప్పుడో..

- ప్రతిపాదనలకే పరిమితమా..
- పాలకులు మారిన మారని బస్టాండ్ రూపురేఖలు



2 లో..

# విద్యార్థులకు నాణ్యమైన విద్య






**ములకలపల్లి, సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో విద్యారంగంలో సమూల మార్పుకు కృషి చేస్తుందని తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ చేనేత శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ములకలపల్లి మండలంలోని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో "స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణతో కలిసి మంత్రి తుమ్మల ప్రారంభించారు. ముందుగా మంత్రి తుమ్మల ఆరోగ్య కేంద్రంలోని పలు చికిత్సల కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ గిరిజన మహిళలతో ఆరోగ్యం విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై కోయ భాషలో వివరించి, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకొని మహిళలు ఎటువంటి నగదు చెల్లించకుండా ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం మండలంలోని మూకమామిడి ఏకలవ్య పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించేందుకు వెళ్లిన మంత్రి తుమ్మలకు, స్థానిక శాసనసభ్యులు విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. మంత్రి తుమ్మల ఆ పాఠశాల తరగతి గదులను, సంగీతగదిని పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు అత్యుత్తమ లక్షణాలు సాధించినందుకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా 23 ఏకలవ్య పాఠశాలలో ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజన విద్యాభివృద్ధి కోసం 8 పాఠశాలలు ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతో విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్యాన్ని సంరక్షిస్తూ హెల్త్ కార్డులు అందజేసి వారి ఆరోగ్య వివరాలు నమోదు చేసేలా నూతన విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. విద్య వైద్యం పారిశ్రామిక రంగాల అభివృద్ధిలో రహదారులు చాలా కీలకమని జిల్లాలో పలు రహదారులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. మూకమామిడి ప్రాజెక్టు సమయంలో 10 ఎకరాలు కేటాయించడం




ద్వారా ఈ పాఠశాలలో ఏర్పాటుచేసి విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించేందుకు సాధ్యమైందన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య క్రీడా సామాగ్రి అందించి అన్ని రంగాల లోనూ వారిని ముందుకు నడిపేందుకు కృషి చేస్తున్నామని జిల్లా ఖ్యాతిని పెంచే విధంగా దేశంలోనే మొట్టమొదటి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని స్థాపించామన్నారు. దీని ద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు ప్రపంచస్థాయి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

### ››› విద్యార్థులు క్రీడలు సాంకేతిక రంగాల్లోనూ రాణించాలి... ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు సాంకేతిక రంగాల్లోనూ రాణించాలని ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేను సైతం చేయూత కార్యక్రమం ద్వారా రూ.1.75 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు తరగతి గదులు లైబ్రరీలు ,కంప్యూటర్ ల్యాబ్, క్రీడా సామాగ్రి కల్పించడం వలన నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలను ప్రభుత్వం అందించేందుకు కృషి చేస్తుందన్నారు. గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు చదవడం ద్వారా గ్రామాలు జిల్లా రాష్ట్ర మొత్తానికి మేలు కలుగుతుందని ప్రజాప్రతినిధులు అందరం కలిసి వారు స్థితికి చేరేందుకు అవసరమైన ప్రతి అవసరాన్ని గుర్తించి అందిస్తామన్నారు.

### ››› తల్లిదండ్రుల త్యాగాలను మరవకండి ...కలెక్టర్ జితేష్ వి పాటిల్

విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి వారిని చదివిస్తున్నారు అన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వారి త్యాగాలను మరవకుండా ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మన జిల్లా భూగర్భ సంపదల కోసం ప్రసిద్ధి చెందిందని జియో లాజికల్ మ్యూజియం ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగ ఉంటుందని విద్యార్థులకు వివరించారు విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగి జిల్లా ఖ్యాతిని పెంచాలని ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని పోటీ పరీక్షల్లో రాణిస్తూ క్రీడలు సాంకేతిక రంగాల్లో ప్రతిభ కనబరచాలన్నారు. జిల్లాలో కేవలం చదువుకోసమే పాఠశాలలు అనేలా కాకుండా వ్యక్తిత్వ వికాసానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గిరిజన గ్రామీణ ప్రాంతాల నుండి విద్యార్థులు పట్టుదలతో ముందుకు వస్తే రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజ్ ఐటీడీఏ పీవో రాహుల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జయలక్ష్మి, డిసిహెచ్ఎస్ రవిబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బీజాపూర్ లో ఎన్ కౌంటర్

**చర్ల, సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ లో బుధవారంతో బీజాపూర్ జిల్లాలోని నైరుతి ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం ఆధారంగా భద్రతా దళాలు శోధన ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ ఆపరేషన్ సమయంలో బుధవారం మధ్యాహ్నం 03.00 గంటల నుండి భద్రతా దళాల ఉమ్మడి బృందంకు మావోయిస్టులకు మధ్య అడపాదడపా కాల్పులు జరిగాయి . ఇప్పటివరకు ఈ సెర్చ్ ఆపరేషన్ సమయంలో ఎన్ కౌంటర్ సైట్ నుండి ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు, ఒక 303 రైఫిల్, ఒక బిజిఎల్ లాంచర్ తో పాటు పేలుడు పదార్థాలు ఇతర నక్సల్ సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నందున ఎన్ కౌంటర్ జరిగిన ప్రదేశం ఆపరేషన్ లో పాల్గొన్న భద్రతా దళాల సంఖ్య ఇతర సున్నితమైన సమాచారాన్ని ఈ సమయంలో పంచుకోలేము అని ఆపరేషన్ పూర్తయిన తర్వాత వివరణాత్మక నివేదిక విడిగా పంచుకోబడుతుంది అని అధికారులు తెలియచేసారు .

## సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడం సంతోషకరం



**ఇల్లందు, సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:** సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడం సంతోషకరమని జగదంబ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు తేజవత్ రాములు అన్నారు. బుధవారం సింగరేణి మండలం భాగ్యనగర్ తండాలో జగదాంబ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మాలోత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడే హిందువులకు తెలంగాణ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ పూర్వ దేవాలయాలన్నిటిని అభివృద్ధి చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు అందరికీ మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జగదంబ సేన జిల్లా నాయకులు బాలాజీ, సాదు సంపత్, సాదు శంకర్, సాదు దేశియా, సాదు రాంపల సాద్ గురు, సాదు శారద, శివశక్తి సరస్వతి, శివశక్తి మహిళలు, సాధువులు పాల్గొన్నారు.

## నూతన బస్టాండ్ నిర్మాణానికి మోక్షం ఎప్పుడో..

**కొత్తగూడెం, సెప్టెంబర్ 17 (ప్రజాజ్యోతి):** పేరుకే జిల్లా కేంద్రంలో ఉన్న కొత్తగూడెం బస్టాండు అని చెప్పుకోవడం తప్ప.. బస్టాండ్ రూపు రేఖలు మారటం లేదు.1975లో అప్పటి ముఖ్యమంత్రి వెంగళరావు శంకుస్థాపన చేసి 1976లో ప్రారంభించారు. సుమారుగా 50 సంవత్సరాల బస్టాండ్ పునర్నిర్మాణానికి నోచుకోవడం లేదు. పాలకులు మారుతున్నారు పరిపాలన మారుతుంది కానీ బస్టాండ్ మారట్లేదు, ప్రతి ప్రభుత్వ హయాంలో నూతన బస్టాండ్ నిర్మాణం కోసం ప్రతిపాదన పెడుతున్నాం అంటున్నారు తప్ప, అమలుకు నోచుకోవట్లేదు, తాత్కాలికంగా మరమతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కాని నూతన నిర్మాణ దిశగా అడుగులు పడటం లేదు. బస్టాండ్ దగ్గర డ్రైనేజ్ వ్యవస్థ సరిగ్గా లేదు, టాయిలెట్స్ ఆపరిశుభ్రత, బస్టాండు స్లాపు నుంచి వాటర్ లీకేజి అయి బస్టాండ్ ప్లాట్ ఫామ్ మొత్తం నీటి ప్రవాహం తలపిస్తూ ఉంటుంది. ఆ నీటి వలన ప్రయాణికులు జారి పడిన సంఘటన కూడా ఉన్నాయి. బస్టాండ్ ఆవరణలోని రహదారి మొత్తం గుంటలమయం, వర్షం వస్తే మొత్తం గుంటలలో నీళ్లు దర్శనమిస్తాయి. బస్టాండ్ అంతర్గత రోడ్డును కూడా వేసే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన బస్టాండ్ ను త్వరితగతిగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.







## వామ్మో కొత్తగూడెం-ఇల్లందు రోడ్డు

- ★ గుంతల రోడ్డు, గుండెల్లో భయం
- ★ రాకపోకలు సాగించ లేక ఇబ్బందులు పడుతుతున్న ప్రయాణికులు, ప్రజలు
- ★ తాత్కాలిక పనులు మూన్నాళ్ళ ముచ్చటగానే
- ★ ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలు లెక్కలేవా.?

**టేకులపల్లి, సెప్టెంబర్17, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం–ఇల్లందు రోడ్డుపై ప్రయాణం అంటే వామ్మో అంటున్నారు ప్రజలు. ఆ రోడ్డు కాస్త పూర్తిగా గుంటలమయంగా తయారయింది. 930పిఎ జాతీయ రహదారి ప్రయాణం ఎటు నుంచి ప్రమాదం పొంచి వస్తుందని ప్రజలు గుండెల్లో భయం, వణుకు పుట్టుకొస్తుంది. ఈ రహదారి గుండ ఎన్నో గిరిజన గ్రామాలకు వెళ్తుంటారు.. వస్తుంటారు. ఇదే రహదారి గుండా ఎన్నో భారీ వాహనాలు, బొగ్గు లారీలు తిరుగుతూ ఉంటాయి. గత ప్రభుత్వ అలసత్వం రోడ్లు, భవనాల శాఖ నిర్లక్ష్యం కారణంగా 930 పి జాతీయ ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఎక్కడికక్కడ రోడ్లు గుంతలు పడ్డాయి. దీనికి తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడవలసి వస్తుంది. ఎక్కడ ఏ గోతు ఎంత లోతు ఉందో అంచనా వేయలేని పరిస్థితి లేక చాలా మంది ప్రయాణికులు ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యారు. భారీ వాహనాలు గోతుల్లో దిగి దెబ్బతిన్నాయి. దీంతో గ్రామీణ రహదారులంటేనే ప్రయాణికులు భయపడుతున్నారు. మండలంలోని పలు ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఏ రోడ్డు చూసినా గుంతలతో దర్శనమివ్వడంతో ప్రయాణం నరకయాతనగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొమ్మనపల్లి స్మశాన వాటిక వద్ద ఉన్న రహదారిపై గుంత, కారకొండ క్రాస్ రోడ్డు స్పీడ్ వద్ద ఉన్న గుంతలు ఎంతో ప్రమాదకరంగా ఉన్నాయి. ఎన్నిసార్లు అధికారులకు తెలిపిన, ఇటు ఆర్ఎంబి, నేషనల్ హైవే, పలు మార్లు రహదార్లు, భవనాల శాఖ, పంచాయతి సిబ్బంది దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కెటీసీ వెళ్లే రహదారి గుంతలు మయం సింగరేణి యాజమాన్యం, సింగరేణి అధికారులు ఉత్పత్తి, రవాణాపై పెట్టిన దృష్టిని రోడ్లపై పెట్టడం మరిచారనే అపవాదు లేకపోలేదు. డ్రైవర్లంటే అధికారుల దృష్టిలో ఎంతో చులకనగా ఉంటుందని బొగ్గు టిప్పర్ డ్రైవర్లు వాపోతున్నారు. డ్రైవర్ల అన్న, వారి జీవితాలు, వారి బాధలు ఉన్న సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదని, టిప్పర్ తో బొగ్గు రవాణా చేయవద్దని సంస్థ లాభాల బాటలు పొంది. రవాణా చేసేందుకు రహదారి గుంతల మయంగా ఉన్న పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. ఈ సమస్యలన్నిటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యే దృష్టి పెట్టి రోడ్ల మరమ్మత్తులు చేపించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# బిజెపి జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో తెలంగాణ విమోచనదినోత్సవ, ప్రధాని మోడీ జన్మదినోత్సవా వేడుకలు





**కొత్తగూడెం టౌన్ సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:**తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరుల త్యాగాలను స్మరించుకున్నారు తదనంతరం భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి,మాజీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జీవీకే మనోహర్ గార్ల ఆధ్వర్యంలో మేఘ రక్తదాన శిబిరాన్ని కొత్తగూడెం ప్రభుత్వ హాస్పటల్ నందు నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమంలో కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా అధ్యక్షుడుబైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రధాని 140 కోట్ల భారతీయులకు రక్షణ కవచం ఎల్లవేళలా ఈ దేశ బావి భవిష్యత్తు గల యువకుల గురించి,మహిళల గురించి, ఈ దేశ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న ప్రజలందరి గురించి ప్రపంచం మెచ్చిన నాయకుడు శ్రీ నరేంద్ర మోడీ గారు అని వారు ఇంకా అనేక సంవత్సరాలు ఆరోగ్యంగా ఉంటూ ఈ దేశానికి సేవలందించాలని అన్నారు.మాజీ జిల్లా అధ్యక్షుడు జీవీకే మనోహర్ రావు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు భారత దేశం వైపు చూస్తున్నది అంటే అది కేవలం నరేంద్ర మోడీ గారి పరిపాలన దక్షతను చూసే ఈ ప్రజలకు నమ్మకాన్ని కలిగిస్తూ ప్రపంచంలోనే అగ్ర నాయకుడిగా ఉంటూ ఈ దేశాన్ని సురక్షితంగా కాపాడే సైనికుడు ప్రధాని నరేంద్ర మోడీ అంటూ కొనియాడారు ఒక వ్యక్తి శక్తిగా ఎదగడం ఎలా ఉంటుంది అన్నది నరేంద్ర మోడీ గారి జీవితం ఆదర్శమని ఈ విధంగా భారత దేశ యువత అకుంఠిత దీక్షతో వారు అనుకున్నా లక్ష్యాలను నెరవేర్చాలంటే శ్రీ నరేంద్ర మోడీ గారి 75 సంవత్సరాల జీవిత కాలం ఒక ఉదాహరణ అని యువకులను ఉద్దేశించి అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్,చుంచుపల్లి మండల అధ్యక్షుడు బలగం శ్రీధర్, జనరల్ సెక్రటరీ ఎం. కృష్ణ, G మహేష్. బీజేపీ నాయకులు శివ, మహిళా మోర్చ నాయకులు జె. స్వప్న, G విజయ పాల్గొన్నారు

# డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరదల చిన విద్యార్థులకు చివరి అవకాశం

**భద్రాచలం, సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:** భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరదలచిన విద్యార్థులకు వన్‌టైమ్ స్పెషల్ స్పాట్ అడ్మిషన్ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. కె. జాన్ మిల్టన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19 తేదీల్లో ప్రత్యేక అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన వారు / తత్సమాన అర్హత కలిగిన స్థానిక, స్థానికేతర విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సమర్పించి అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు.అర్హత కలిగిన అభ్యర్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం దోస్త్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఏ. శ్రీను, ఫోన్: 9291491507 ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# గుట్టల్లో గిరిపుత్రులకు కొత్త పాఠశాల, తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా విద్యా హక్కు సాకారం




**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:**అశ్వారావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండలంలోని రజబలినగర్ గ్రామంలో గుట్టల్లో నివసించే గిరిపుత్రుల కోసం కొత్త పాఠశాలను మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ ప్రారంభించారు.జూలైలో ఈ ప్రాంతాన్ని పర్యటించిన అధికారులు అక్కడి సమస్యలను పై అధికారులకు వివరించారు. సమీప మహబూబ్ నగర్ నుంచి ఉపాధ్యాయులు ప్రతిరోజూ వాగులు, వంకలు దాటుకుంటూ విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్లి తీసుకొచ్చేవారని, దారిలో అడవి జంతువులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఇంత కష్టంతో పిల్లలను పాఠశాలకు పంపడం ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రులు వాపోయారు.ఈ పరిస్థితిని మండల విద్యాశాఖాధికారి జిల్లా, రాష్ట్ర అధికారులకు తెలియజేయడంతో తక్షణం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. కరోనా ముందు ఒక స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన షెడ్డు ఇప్పుడు ప్రాథమిక పాఠశాలగా మారింది. విద్య ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని, దూర ప్రాంతాల పిల్లలకు కూడా సమాన హక్కులు చేరవలసిన అవసరముందని ఆనంద కుమార్ అన్నారు.విద్యార్థులను గుర్తించి ప్రతిరోజూ వారిని తీసుకువెళ్ళి తీసుకొస్తున్న ఉపాధ్యాయులు తేజవత్ కృష్ణ, కోర్సా బుచ్చయ్యను ఆయన అభినందించారు. వారి కృషి వల్లే ఇక్కడ పాఠశాల ఏర్పాటయ్యిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీసీఓ వెంకట రమణ, సీఆర్ పీ శిరీష, కృష్ణ, బుచ్చయ్య, బి. వెంకటేశ్వరరావు, జయరాం, శంకర్ మహదేవన్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు పాఠశాల ఏర్పాటుపై ఆనందం వ్యక్తం చేశారు.

# హనుమాన్ నగర్ ప్రజలకు రహదారి కష్టాలు

- హెల్త్ సమస్య వస్తే ప్రాణాలకు ముప్పే





**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి):**మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని తాటి బుచ్చన్నగూడెం నుండి హనుమాన్ నగర్‌కు వెళ్లే రహదారి దారుణ స్థితికి చేరింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రహదారి అంతటా లోతైన గుంటలు ఏర్పడి, ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారాయి.హనుమాన్ నగర్ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారికి చేరుకోవాలంటే కనీసం మూడు గంటల సమయం పట్టుతోందని బాధపడుతున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, రైతులు వ్యవసాయ పనులకు చేరుకోవడంలో కష్టాలను అనుభవిస్తున్నారు. ఈ రహదారిని గతంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిశీలించినా, ఇప్పటివరకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్దం, కొర్రి వీరభద్రం, పద్దం కన్నయ్య, కొర్రి వీరాస్వామి, మోడియం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలకు అన్నం పెట్టిన కాంపెల్లి కనకేష్



**పాల్వంచ (రూరల్), సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:**పాల్వంచ మండలంలోని జగన్నాధపురం రైతు వేదిక వద్ద యూరియా కోసం ఉదయం నుండి క్యూలైన్లో వేచి ఉన్న రైతులకు మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశారు.బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు,పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్ పటేల్ ఆధ్వర్యంలో ఇది మూడవ రోజు కొనసాగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ మనకు అన్నం పెడుతున్న రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతుంటే కనీసం వారికి భోజనం ఏర్పాటు చేయడం నా బాధ్యత అని అన్నారు.రైతులు సంతోషంగా భోజనం చేసి ఆశీర్వాదాలు అందించడం తనకు సంతృప్తినిస్తుందని,ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తులోనూ రైతులకు భోజన సదుపాయం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.అదే విధంగా రోజూ పాల్వంచ మండలంలో 500 మందికి పైగా రైతులు యూరియా కోసం వచ్చి క్యూలైన్లో వేచి చూస్తున్నారని,ఒక బస్తా మాత్రమే ఇవ్వడం రైతుల అవసరాలకు ఏమాత్రం సరిపోవడంలేదని పేర్కొన్నారు.5–10 ఎకరాలు వ్యవసాయం చేసే రైతుకి ఒక బస్తా యూరియా సరిపోదని,కనీసం రెండు బస్తాలకు పైగా ఇవ్వాలని ప్రభుత్వానికి,సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సంగ్లోత్ రంజిత్, కొత్తచెరువు హర్షవర్ధన్,పూజాల ప్రసాద్,ఆలకుంట శోభన్,కొట్టె రాఘవేంద్ర (రవి),గంగాధరి పుల్లయ్య,పోసారపు అరుణ్,కుమ్మరి కుంట్ల వినోద్,గజ్జల రితిక్, కాంపెల్లి నవీన్,కూరెళ్లి మురళి మోహన్,చిన్నకర్నన్ ప్రవీణ్,తోట సతీష్,గిద్దలూరి శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**పాల్వంచ (రూరల్), సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:**పాల్వంచ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 9:30 గంటలకు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి విజయభాస్కర రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.అనంతరం ప్రజా సేవకులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ సుధాలక్ష్మి,సహాయక ప్రాజెక్టు అధికారి పోరండ్ల రంగ,సిబ్బంది శారద,రోహిణి, కళ్యాణి,శాంతి,జిలాని, వెంకటేశ్వర్లు,ఉపాధి హామీ సిబ్బంది లక్ష్మణ్, రాజు, సైదులు, సుజాత,రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు



**ఇల్లందు, సెప్టెంబర్ 17, ప్రజాజ్యోతి:** ప్రజాపాలన దినోత్సవాన్ని ఇల్లందులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలోనూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక శ్రేణి కార్యదర్శి వి సుచిత్ర, సూపర్వైజర్ ఎన్ శ్రీనివాసరావు, సిబ్బంది రంజిత్, మధు, మునీర్, రమేష్, విజయ్, కార్తీక్, మోహన్ రావు, హరికృష్ణ, నియోజకవర్గ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, శ్రీ హరిహరక్షేత్రం చైర్మన్ గండె సదానందం, మండల పార్టీ అధ్యక్షుడు పులి సైదులు, నాయకులు పూనెం సురేందర్, జాఫర్, కల్తీ పద్మ, సైదా మియా తదితరులు పాల్గొన్నారు.

## తాళాలు వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేస్తున్న కేటుగాళ్లు

- నగదు, బంగారం, వెండి వస్తువులు అపహరణ.



**జూలూరుపాడు,సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని మాచినేనిపేట తండాలో తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగల కొట్టి నగదు, బంగారు వస్తువులు మరియు వెండి వస్తువులు ఎత్తుకుపోయిన ఘటన చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే బీరెల్లి సుధాకర్ వాణి దంపతులు మాచిన పేట తండ లో ఉన్న వారి సొంత ఇంటిలో ఉంటున్నారు సుధాకర్ స్వతహాగా ఫోటో గ్రాఫర్ గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తగూడెంలో ఉన్న మరో ఇంటికి తరచూ వెళ్లి వస్తుంటారు ఈ క్రమంలోనే 16వ తారీఖున మధ్యాహ్న సమయంలో భార్యాభర్తలిద్దరూ కొత్తగూడెంలోని వారి ఇంటికి వెళ్లి 17 వ తారీకు ఉదయం సుమారు 11 గంటల సమయంలో మాచినపేట తండ లో ఉన్న వారి ఇంటికి వచ్చి చూడగా తాళం పగలకొట్టి ఉండటానికి గమనించారు అనుమానం వచ్చి తలుపు తెరిచి చూడగా లోపల ఉన్న బీరువా సైతం పగలకొట్టి ఉండడంతో విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేశారు అయితే బీరువాలో ఉన్న నగదు బంగారు వస్తువులు వెండి వస్తువులు సైతం అపహరణకు గురైనట్లు గుర్తించారు విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు విచారణ చేపట్టారు.

## మహాత్మ జ్యోతిబా పూలే కళాశాలలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి):** ప్రజల పాలనకు సంకేతమైన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలుర డిగ్రీ మరియు జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ ఎస్.కె. బురాన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, తెలంగాణ విమోచన పోరాటంలో అమరులైన వీరుల త్యాగ గాథలను వివరించారు. విద్యార్థులు వారిని స్మరించుకుని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎ.టి.పి. శ్రీకాంత్, డిప్యూటీ వార్డెన్ మధు, పీడీ డాక్టర్ రఘువరన్, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## దశదిన కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్.

- సురేష్ మరణం రాజకీయాలకు తీరని లోటు.



**జూలూరుపాడు, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పరిధిలోని పాపకొల్లు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సురేష్ దశదిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ హాజరై సురేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఓ బలమైన నాయకుడిని కోల్పోయిందని. భవిష్యత్తు ఉన్న కాంగ్రెస్ నాయకుడు సురేష్ చనిపోవడం బాధాకరమని అన్నారు తన కుటుంబ సభ్యులను ఓదార్చారి. భగవంతుడు ఆ కుటుంబాన్ని మంచిగా చూసుకోవాలని ప్రార్థించారు కార్యక్రమంలో యాస నరేష్, బిఆర్ఎస్ నాయకుడు లాకావత్ గిరి బాబు, చందా నాయక్,దేవిలాల్ తుళ్లూరు కనకయ్య,తాళ్లూరు అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు

# జాతీయ స్థాయి నృత్య పోటీల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**పాల్వంచ(రూరల్),సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని శ్రీ సంతోషిని నాట్య నిలయం ఆధ్వర్యంలో జాతీయస్థాయి భద్ర శైల డాన్స్, మ్యూజికల్ కాంపిటీషన్స్ నవంబర్ 8,9 తేదీల్లో పాల్వంచ శ్రీ సీతా రామ కళ్యాణ మండపంలో జరగనున్నాయి.ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ,స్థానిక ప్రతిభకు జాతీయ స్థాయిలో వేదిక దొరకడం ఆనందకరమని,ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు యువతలో కళాత్మక విలువలను పెంపొందిస్తాయని అన్నారు.ఈ పోటీలకు ముఖ్య అతిథిగా తప్పక హాజరవుతానని హామీ ఇచ్చారు. డాన్స్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు రమాదేవి రామ్ మాట్లా డుతూ,గత మూడేళ్లుగా కేవలం కూచిపూడి, ఫోక్ నృత్య పోటీలు మాత్రమే నిర్వహించామని,ఈసారి కూచిపూ డి,భరతనాట్యం,ఫోక్ డాన్స్,కర్ణాటక సంగీతం వంటి విభాగాలలో పోటీలు జరగనున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోటీల కోఆర్డినేటర్ దొడ్డ రాంబాబు, పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 17 ప్రజా జ్యోతి:** ప్రజా హక్కుల పరిరక్షణకు, పారదర్శక పరిపాలన స్థాపనకు చిహ్నంగా నిలిచే ప్రజా పాలన దినోత్సవం భద్రాచలం ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం డివిజన్ ఆఫీస్ ప్రాంగణంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డి ఈ జీవన్‌కుమార్ జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం, హక్కుల పరిరక్షణే నిజమైన ప్రజా పాలన అని, ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన ద్వారానే ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయడం, వాటిని ప్రతి పేదవాడి ఇంటి దరి చేరడం, సమాజంలోని అన్ని వర్గాలను సమానంగా ఆదుకోవడం మన కర్తవ్యమని గుర్తు చేశారు. అలాగే, "ప్రతి ఉద్యోగి బాధ్యతగా పని చేయాలని, ప్రజా పాలన అంటే కేవలం ఒక వేడుక కాదు, అది మన దైనందిన జీవితంలో ఆచరించాల్సిన ధ్యేయం అని వివరించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా నిజాయితీతో, నిబద్ధతతో పని చేస్తేనే ప్రజాస్వామ్యం పటిష్టం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ఉద్యోగుల సంఘాల నాయకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజా పాలన దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

## భద్రాచలంలో ప్రజాపాలన దినోత్సవం



**భద్రాచలం, సెప్టెంబర్ 17,ప్రజాజ్యోతి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, డీసీసీ అధ్యక్షుడు పోదెం వీరయ్య సూచనలతో భద్రాచలం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో సీనియర్ నేత కోమనపల్లి ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా పరిమి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాపాలన దినోత్సవం ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకమని, తెలంగాణ ఆవిర్భావంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. సమానత్వం, న్యాయం, అభివృద్ధి కోసం పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. గ్రామ స్థాయివరకు అభివృద్ధి చేర్చడమే లక్ష్యమని, రైతులు, మహిళలు, యువత సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతిరాల రవికుమార్, నాయకులు అడబాల వెంకటేశ్వరరావు, గానుగ రమణ, బత్తుల సాంబయ్య, సేవాదళ్ మండల అధ్యక్షుడు శీలం రామ్మోహన్ రెడ్డి, పసికంటి శ్రీను, ఎస్కే రంజిత్ ఖాన్, మహిళా నాయకులు పందల సరిత, పద్మాప్రియ, నాగమణి పార్వతి తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ముగిసిన హిందీ దినోత్సవ వేడుకలు



**పాల్వంచ(రూరల్),సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి)లో బుధవారం హిందీ భాషా దినోత్సవం ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మ, హిందీ విభాగాధ్యక్షురాలు డాక్టర్ టి. అరుణకుమారి మాట్లాడుతూ, హిందీ భాష భారతదేశ సంస్కృతి, ఐక్యత,ఆత్మగౌరవానికి ప్రతీక అని, హిందీతో పాటు అన్ని భారతీయ భాషలను గౌరవించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా హిందీ వ్యాసరచన,క్విజ్, కవితా పఠనం,ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ వేడుకలో హిందీ ఉపన్యాసకురాలు షహనాజ్ ఖాన్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రుగొండలో ఘనంగా ప్రజా పరిపాలన దినోత్సవ వేడుకలు

- ప్రభుత్వ కార్యాలయాల్లో ఎగరవేసిన జాతీయ పతాకం





**చంద్రుగొండ సెప్టెంబర్ 17 ప్రజా జ్యోతి:** ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం చంద్రుగొండ మండల కేంద్రము లోని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం లో తహసిల్దార్ బి సంధ్యారాణి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బయ్యారపు అశోక్, పోలీస్ స్టేషన్ లో ఎస్సై శివరామకృష్ణ, పశువైద్యశాలలో సంతోష్, చంద్రుగొండ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో రేంజర్ సిహెచ్ ఎల్లయ్య, సిడిపిఓ కార్యాలయంలో సిడిపిఓ సలోమణి, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వెంకట ప్రకాష్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, జాతీయ జెండాలను ఎగరవేశారు ఈ కార్యక్రమంలో మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల తుమ్మల
- భగవాన్ విరాట్ విశ్వకర్మ ఫలితమే శిల్పకళా నిర్మాణాలు
- రాష్ట్ర మంత్రి తుమ్మల






**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:** భగవాన్ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పాల్గొనివిశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భగవాన్ విరాట్ విశ్వకర్మ విశ్వశిల్పి, దేవశిల్పి, ఆకాశానికి, భూమికి, దేవాలయాలకు, రథాలకు, ఆయుధాలకు రూపకర్తగా నిలిచారన్నారు, దేవతలకు కావలసిన నిర్మాణాలు, నగరాలు, ఆభరణాలు, శిల్పకళా నిర్మాణాలు అన్నీ విశ్వకర్మ సృష్టి ఫలితమని ఆయన అన్నారు. విశ్వకర్మ ఆవిష్కరణలు, శిల్పకళ, శ్రమ విలువను గుర్తిస్తూ ఆయనను అద్యబ్రహ్మగా పూజిస్తున్నామని తెలిపారు, బడుగు బలహీన వర్గాలు, కూలీలు, శ్రమజీవులు, చేతి వృత్తిదారుల ప్రతిభ, కృషి వల్లే సమాజం ముందుకు సాగుతుందని, వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. బీసీల కుల గణన కూడా ఈ వర్గాలకు గౌరవప్రదమైన స్థానం కల్పించడానికి చేపట్టిన ఒక చారిత్రక అడుగు అని తెలిపారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల వారికి అందే విధంగా చూడాలని కోరారు, ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యా చందన, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా అధికారులు, ఉద్యోగులు, బీసీ సంఘం నాయకులు వెంకటాచారి , వారాధి సత్యనారాయణ , బసవపాత్రుని తిరుపతి , వారాధి రామాచారి , బి. సాంబయ్య , ఎస్. కృష్ణమాచారి , కూరపాటి లింగాచారి , పొడిచేటి వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి హరిహరక్షేత్రంలో అయ్యప్ప దీక్షల కోలాహలం



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:** భద్రాద్రి హరిహరక్షేత్ర ప్రాంగణం బుధవారం అయ్యప్ప శరణు ఘోషలతో మార్మోగింది. మండల దీక్షల సమయం సమీపిస్తుండటంతో అయ్యప్ప మాల స్వీకరణ ఘనంగా ప్రారంభమైంది. సెప్టెంబర్ 17వ తేదీ ఉదయం ఆలయంలో ప్రత్యేక ప్రాతఃకాల అభిషేకాలు, పూజలు నంబూద్రి అరుణ్ రామచంద్రన్ గారి నేతృత్వంలో వైభవంగా జరిగాయి. అనంతరం అయ్యప్ప నామస్మరణతో సుమారు 30 మంది భక్తులు మాలలు ధరించి స్వామియే శరణం అయ్యప్ప అంటూ గర్భాలయాన్ని మార్మోగించారు. అనంతరంశ్రీ అయ్యన్ అయ్యప్ప స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. అదే సమయంలో ఆలయ నిత్యబుధవార అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహించబడింది. ముందుగా నంబూద్రి అన్న నైవేద్యం సమర్పించగా, అనంతరం ప్రాంగణంలో సుమారు 200 మంది అయ్యప్ప, భవాని మాల స్వాములకు అన్నప్రసాదం అందించారు. అలాగే వివిధ ప్రాంతాల్లో ఉన్న సుమారు 20 మంది భక్తులకు పాకెట్ రూపంలో అన్న ప్రసాదాలు పంపిణీ చేయడం జరిగింది.ఈ సేవా కార్యక్రమం భద్రాద్రి హరిహరక్షేత్ర శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం, నవగ్రహ మండపం తరఫున, శ్రీ శివన్ గురు స్వామి ఆశీస్సులతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఆలయ ప్రాంగణం నిండా స్వామియే శరణం అయ్యప్ప నినాదాలు ప్రతిధ్వనిస్తూ, మాల స్వీకరణ కార్యక్రమం ఆకర్షణీయంగా, ఆధ్యాత్మిక శోభతో సాగింది.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**చర్ల, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవా రం చర్ల మండలం వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ప్రాంగణం లో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనం గా నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇర్ప శ్రీనివాస్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు .ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ప్రజా పాలనలో పారదర్శకతను పెంచి, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంపొందించి స్ఫూర్తిని నింపుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చర్ల మండల అధ్యక్షులు ఆవులు విజయభాస్కర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ రైతు డివిజన్ అధ్యక్షులు ఇందుల బుచ్చిబాబు , మాజీ ఎంపీటీసీ మడకం పద్మజ, ఆవుల పుల్లారావు, రైతులు, ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచులు, యువజన నాయకులు, కార్యకర్తలు వ్యవసాయ మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులర్ బ్యాంకు మేనేజర్ ని నియమించండి



**చర్ల, సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం ఆర్. కొత్తగూడెం గ్రామంలోని గ్రామీణ వికాస్ బ్యాంకు నందు రెగ్యులర్ మేనేజర్ ని నియమించాలని ఉదయం 11.30 లకు గ్రామస్తులందరూ కూడా నిరసన కార్యక్రమం తెలియజేశారు. గత మూడు నెలలుగా డ్వాక్రాకు సంబంధించిన లావాదేవీలు ఏవి కూడా సరిగ్గా జరగడం లేదు అని ముఖ్యంగా డ్వాక్రాలోను కి సంబంధించి చాలా ఇబ్బందులకు గురవుతున్నారు అని రెగ్యులర్ మేనేజర్ వచ్చినప్పుడు ఇస్తారని వచ్చిన మేనేజర్ చెప్తున్నారు అని దీనితో అందులోని ఖాతా దారులు అందరు కూడా చాలా ఇబ్బందులకు గురవుతున్నారు అని ఆదివాసీ నాయకులు నాయకులు సోడి చలపతి పులిగుండల సర్పంచ్ అన్నారు. రెగ్యులర్ మేనేజర్ ని వెంటనే నియమించాలని లేని పక్షంలో నిరసన కార్యక్రమం మరింత ఉధృతంగా చేయ టం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి మండల నాయకులు గొందిబియన ఎక్స్ ఎంపీపీ , లీలా ప్రసాద్ , ఆదివాసి మహిళా నాయకురాలు కనితి రజిని , కారం సుధాకర్ , నూకలక్ష్మి,చంద్రకళ నాగమణి, కనితి సుశీల ప్రజలు నాయకులు తదితరులు పాల్గొనన్నారు .

## బిజెపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవము





**చర్ల, సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భగా భారతీయ జనతా పార్టీ చర్ల మండల కార్యాలయం నందు మండల అధ్యక్షులు నూప రమేష్ జాతీయ పతకాన్ని ఎగుర వేసి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి తెలంగాణ లో నిజాం ప్రభుత్వం రజాకార్ల నిరంకుశ పరిపాలన ప్రజల పట్ల వాళ్ళు చేసిన ఆగడాలను వివరించారు.తరువాత పార్టీ కార్యాలయం వద్ద చాక్లెట్స్ , బిస్కట్లు . స్వీట్లు. పంచి పెట్టారు.అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదిన సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి లోని రోగులకు అరటి పండ్లు ఆపిల్స్ దానిమ్మ పంచిపెట్టారు.స్థానిక త్రికుట దేవాలయం నందు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేరున అర్చన పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో జిల్లా కౌన్సిల్ మెంబర్. బాబా ఫహీం,జిల్లా కార్యవర్గ సభ్యులు గునూరి రమణ ,ప్రధాన కార్యదర్శి ఇర్ప సుబ్బారావు, ఎంపీటీసీ ఇంచార్జి సరియం ధర్మరాజు, మండల కార్యదర్శులు ముత్తారపు శ్రీనివాస చారి, బంధా మధు, చింతురి విశ్వనాధ్,గార రాంబాబు, కుప్పా మాధవరావు, మల్లెల ప్రశాంత్, పీ వినయ్,జి , రాంబాబు రంజా,సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ విద్యా విధానంలో విద్యార్థులు సులభంగా నేర్చుకోవచ్చు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:** కొత్తగూడెం జిల్లా విద్యా శిక్షణా కేంద్రం, కొత్తగూడెం నందు బుధవారం జరిగిన కార్యక్రమం లో జిల్లాలోని 8 ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లకు ,2 భవిత సెంటర్ ల ఐ ఈ ఆర్ పి లకు సి ఎస్ ఆర్ కింద భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ కేవైఏఎన్ ( డిజిటల్ బోధనా పరికరాలు ) లను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా అందజేశారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సి ఎస్ ఆర్ లో భాగంగా భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వారు ప్రత్యేకంగా భద్రాద్రి జిల్లాలో 25 లక్షల రూపాయలు విలువ చేసే బోధనా పరికరాలను ఇచ్చినందుకు వారికి అభినందనలు తెలియజేశారు. ఈ పరికరాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు ఉపయోగపడేలా బోధనలో సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. అదేవిధంగా రానున్న కాలంలో మన జిల్లాలోని సుమారు 250 పాఠశాలలకు ఇదే విధంగా కే వై ఏ యెన్ లను మంజూరు చేయమని భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ వారికి ప్రతిపాదించామని కలెక్టర్ తెలియ జేశారు. అనంతరం భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చొరవతో ఈ జిల్లాకు భవిష్యత్తులో కూడా తప్పనిసరిగా సహకారం అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి నాగలక్ష్మి, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు సతీష్ కుమార్,సైదులు, నాగరాజశేఖర్ ,భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ , బి ఈ ఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏటిప సభ్యత్వ నమోదు కార్యక్రమం



**చర్ల , సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం ఏ టి ఏ చర్ల మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జనరల్ ఫండ్ సేకరణ లో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు .ఈ సందర్భగా సత్యనారాయణపురం జిల్లా పరిషత్ పాఠశాల నందు ఏర్పాటుచేసిన సమావేశంలో భద్రాద్రి జిల్లా ఏటిప జిల్లా ప్రధాన కార్యదర్శి నానమాద్రి సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ పరమైన అంశాలను తెలుసుకుంటూ ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాల కొరకు "ప్రత్యేక చట్టాన్ని" తీసుకురావడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 1986, 2020 లను అనుసరించి ఐదవ షెడ్యూల్ పేరా (2) ప్రకారంగా ఏజెన్సీ ప్రాంతంలో లోకల్ క్యాడర్ నందు ఆదివాసులకు ఉద్యోగ కల్పనకు" ప్రత్యేక చట్టం " రూపకల్పనకు ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సమావేశ ఏర్పాటుకు ప్రభుత్వ అధికారులను ఆదేశించి, ప్రత్యేక చట్టం తీసుకురావడానికి ట్రైబల్ అడ్వైజరి కౌన్సిల్ తీర్మానం చేసి, రాష్ట్ర అసెంబ్లీ ఆమోదంతో "ప్రత్యేక చట్టం" తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .గత జీవో ఎంఎస్ నెంబర్ 3 ప్రకారంగా పొందిన లోకల్ బాడీ ఉద్యోగులలో రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే 22 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్ పొందలేదని తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 610 మండలాల్లో కేవలం ఏజెన్సీ ప్రాంతం 50 మండలాల్లో మాత్రమే ఉందని ఈ చిన్న ఏరియాలో సుప్రీం కోర్ట్ జడ్జిమెంట్ 50% రిజర్వేషన్ మించలేదని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మరొక జీవో ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్ –2భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అఫ్ గ్రేడేషన్ ప్రక్రియకు ప్రత్యేక చొరవ చూపాలని, అప్గ్రేడ్ అయిన కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలకు ఉపాధ్యాయ బోధనేతర సిబ్బంది పోస్టులు మంజూరు చేసి నియమకాలు చేపట్టాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏటిప రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సవలం వీరస్వామి, జిల్లా సంయుక్త కార్యదర్శి కొర్స చిట్టిబాబు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామల రామారావు, తోకల లక్ష్మీపతి, సోయం శేషు, తుర్రం సావిత్రి, సోయం శ్యామ్ కుమార్, కొర్స రాజబాబు, గుండి నాగమణి మేకల అశోక్ తునికి పాండురాజు కనితి నవీన్ వెల్దాం పరిషిక రాజు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం క్రీడాకారుల ప్రతిభకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు







**భద్రాచలం, సెప్టెంబర్ 17,ప్రజా జ్యోతి :** ఏజెన్సీ ప్రాంతం యువ క్రీడాకారులు హైదరాబాద్‌లో జరిగిన హెచ్‌పిఎ వన్డే క్రికెట్ లీగ్‌లో తమ ప్రతిభ చాటారు. భద్రాచలం చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీకి చెందిన నక్కరి రిత్విక్ 66 పరుగులు, విశాల్ 81 పరుగులు రాణించగా, చరణ్ 5 వికెట్లు తీసి జట్టు విజయానికి ప్రధాన కారణమయ్యారు.ఇక గతంలోనూ ఈ అకాడమీ నుంచి మాన్విత్ యాదవ్, అనన్య యాదవ్, గురు, విద్వాన్ లాంటి ఆటగాళ్లు రాష్ట్ర స్థాయి జట్లకు ఎంపిక కావడం గమనార్హం. తాజా విజయాలతో రిత్విక్, విశాల్, చరణ్ లాంటి క్రీడాకారులు కూడా భద్రాచలానికి మంచి పేరు తెచ్చారు.వీరిని అభినందించిన చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ కోచ్ తేజ మాట్లాడుతూ, "వచ్చే నెలలో జరగబోయే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో కూడా మా శిష్యులు విజయాలు సాధించి అకాడమీకి, భద్రాచలానికి గౌరవాన్ని తీసుకువస్తారని నమ్ముతున్నాను" అన్నారు.భవిష్యత్తులో భద్రాచల క్రికెటర్లకు జాతీయ స్థాయి అవకాశాలు లభించేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఇంఫార్మర్ నెపంతో ఇద్దరు గ్రామస్తుల హత్య

- **దంతెవాడలో ఒకరు**
- **బీజాపూర్ లో ఒకరు**






**చర్ల, సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లను నిర్మూలించడానికి భద్రతా దళాలు కొంతకాలంగా నిరంతర ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. నక్సలైట్లను నిర్మూలించడానికి భద్రతా సిబ్బంది ప్రచారంలో నిమగ్నమై ఉన్నారు. భద్రతా దళాల కొనసాగుతున్న చర్యలతో నక్సలైట్లు భయపడుతున్నారు. ఒక వైపు నక్సలైట్లు చర్చలకు విజ్ఞప్తి చేస్తూ ఒక లేఖ రాస్తుండగా మరోవైపు వారు ఒక గ్రామస్థుడిని చంపారు. సమాచారం ప్రకారం అరన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నీలావాయ గ్రామంలో గురువారం రాత్రి నక్సలైట్లు గ్రామస్థుడు బండి కొర్రమ్‌ను హత్య చేశారు. సాయుధ నక్సలైట్లు గ్రామంలోకి వచ్చి బండి కొర్రమ్‌ను అతని ఇంటి నుండి బయటకు నెట్టి, పదునైన ఆయుధంతో దాడి చేశారు.అతను అక్కడికక్కడే మరణించాడు. స్థానిక వర్గాల సమాచారం ప్రకారం బండి కొర్రం కుటుంబాన్ని ఇప్పటికే నక్సలైట్లు లక్ష్యంగా చేసుకున్నారు. దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం అతని కుమారుడు హరేంద్ర కొర్రంను కూడా నక్సలైట్లు హత్య చేశారు. ఆ సంఘటన తర్వాత, కుటుంబాన్ని ఓదార్చడానికి ప్రభుత్వం మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అతని కుమార్తెకు పోలీసు శాఖలో ఉద్యోగం కల్పించింది. ఈ సంఘటన నక్సలైట్లు భయాందోళనలను వ్యాప్తి చేయడానికి చేసిన ప్రయత్నమని పోలీసులు చెబుతున్నారు. సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే అరన్పూర్ పోలీస్ స్టేషన్ భద్రతా దళాలు గ్రామానికి చేరుకున్నాయి ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నారు .మరోవైపు ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లా జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని బెంచరం గ్రామంలో నివసించే దష్రు రామ్ ఓయం, తండ్రి లచ్చు ఓయం, వయస్సు 36 సంవత్సరాలు మురియా కులం దష్రు రామ్ ఓయంను మంగళవారం రాత్రి మావోయిస్టులు పదునైన ఆయుధంతో గాయపరిచి హత్య చేసినట్లు జంగ్లా పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందింది. సమాచారాన్ని అధికారులు ధృవీకరించిన తర్వాత మంగళవారం రాత్రి మావోయిస్టులు ఇంటికి వచ్చి దష్రు ఓయంను ఇన్‌ఫార్మర్‌గా ఆరోపించి ఇంటి నుండి బయటకు తీసుకెళ్లి టాంగియాతో కొట్టి చంపారని స్పష్టమైంది. జంగ్లా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

## 12 మంది మావోయిస్టులు లొంగుబాటు

- **లొంగిపోయిన వారిపై 18 లక్షల రివార్డు**
- **ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 177 మంది మావోయిస్టు లొంగుబాటు**




**చర్ల, సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ నారాయణపూర్ లో సేవ్ మాఢ్ ప్రచారంలో భాగంగా భద్రతా దళాల నిరంతర ఒత్తిడి కారణంగా మంగళవారం జిల్లాలో 12 మంది నక్సలైట్లు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు, ఏ ఓ ఎస్ (సి యెన్ ఏం ) అధ్యక్షుడు, పీ పీ సి ఏం అధికారి, జనతానసర్కార్ అధ్యక్షుడు, సైనిక ప్లాటూన్ పీ పీ సి ఏం , పార్టీ సభ్యులు, మిలీషియా కమాండర్ జనతాన సర్కార్ సభ్యుడు ఉన్నారు. లొంగిపోయిన నక్సలైట్లకు మొత్తం 18 లక్షల రివార్డ్ ప్రకటించారు.పోలీసు సూపరింటెండెంట్ రాబిన్సన్ గురియా (ఐ పీ ఎస్ ) సమక్షంలో జరిగిన ఈ లొంగుబాటు కార్యక్రమంలో ఐ టి బి పీ లోని 53వ, 38వ మరియు 45వ బెటాలియన్ల సీనియర్ అధికారులు, అదనపు పోలీసు సూపరింటెండెంట్లు, డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్లు మరియు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.లొంగిపోయిన ప్రతి నక్సలైట్కు 50,000 రూపాయల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఛత్తీస్గఢ్ ప్రభుత్వ పునరావాసం నక్సల్ నిర్మూలన విధానం కింద అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను కూడా వారికిఅందిస్తారు. పోలీసుల విచారణలో, లొంగిపోయిన నక్సలైట్లు మావోయిస్టు సంస్థ అగ్ర నాయకత్వం గిరిజన ప్రజలకు నిజమైన శత్రువు అని వెల్లడించారని పోలీసులు తెలిపారు. నీరు, అడవులు భూమిని రక్షించడం, సమానత్వం న్యాయం సాధించడం అనే తప్పుడు కలల ద్వారా స్థానిక యువత తప్పుదారి పట్టిస్తున్నారని వారు పేర్కొన్నారు. మహిళా నక్సలైట్ల దోపిడీ అంశాన్ని కూడా లేవనెత్తారు. లొంగిపోయిన కార్యకర్తలు సంస్థలోని మహిళల జీవితాలను నరకంలా అభివర్ణించారని వారిని వ్యక్తిగత బానిసలుగా చూస్తున్నారని పోలీసులు తెలిపారు.లొంగిపోయిన నక్సలైట్ల జాబితా వారిలో ప్రముఖులు ముద్రేన్ నేతం అలియాస్ సుధాకర్ (మాజీ ఏరియా కమిటీ సభ్యుడు, రివార్డు రూ. 5 లక్షలు ), ధోవా సలాం అలియాస్ మహేష్ సలాం (మాజీ ఏరియా కమిటీ సభ్యుడు, రివార్డు రూ. 5 లక్షలు ), సతారో సలాం (ఏ ఓ ఎస్ సి యెన్ ఏం అధ్యక్షుడు, రివార్డు రూ.2లక్షలు ),లక్ష్మణ్ మద్వి (మిలిటరీ ప్లాటూన్ పీ పీ సి ఏం రివార్డు రూ.2 లక్షలు )ఇతర కేడర్లపై రూ. 1 లక్ష నుండి రూ. 50 వేల వరకు రివార్డులు ప్రకటించారు.కఠినమైన అడవులు మరియు కఠినమైన భౌగోళిక పరిస్థితులలో నివసించే అబుజ్మడ్ స్థానిక ప్రజలను నక్సలైట్ భావజాలం నుండి విముక్తి చేయడమే పోలీసుల ప్రాథమిక లక్ష్యం అని పోలీసు సూపరింటెండెంట్ రాబిన్సన్ గురియా అన్నారు. మావోయిస్టు కార్యకర్తలు ఆయుధాలను వదులుకుని జనజీవన స్రవంతిలో చేరాలని సమాజంలో శాంతి అభివృద్ధి ప్రక్రియలో భాగం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.2025లో మావోయిస్టు సంస్థల అగ్ర నాయకత్వానికి భద్రతా దళాలు గణనీయమైన నష్టాన్ని కలిగించాయని ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్రా రాజ్ పి. (ఐపీఎస్) పేర్కొన్నారు. మావోయిస్టులకు ఇప్పుడు హింసను విడిచిపెట్టి లొంగిపోవడం తప్ప వేరే మార్గం లేదని ఆయన అన్నారు.
2025లో లొంగుబాటు పెరుగుదలఈ తాజా లొంగుబాటు ఈ సంవత్సరం సాధించిన ప్రధాన విజయాలలో ఒకటి. 2025 లో ఇప్పటివరకు మొత్తం 177 మంది నక్సలైట్లు వారి సహచరులు వివిధ స్థాయిలలో లొంగిపోయారు అని నిరంతరం శిబిరాల ఏర్పాటు, పెరిగిన పోలీసు ఉనికి సంస్థలోని అంతర్గత దోపిడీతో విసిగిపోయిన మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలని భద్రతాబలగాలు అన్నారు .

## మోస్ట్ వాంటెడ్ నక్సలైట్ల బ్యానర్లు

- **సమాచార ఇవ్వండి రివార్డు పొందండి అంటున్న పోలీసులు**




**చర్ల, సెప్టెంబర్ 17:(ప్రజా జ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ లోని నక్సలైట్ల ప్రభావిత కాంకేర్ జిల్లాలోని పోలీసులు వాంటెడ్ నక్సలైట్లకు వ్యతిరేకంగా కొత్త వ్యూహాన్ని అనుసరించారు. అంతర్గత ప్రాంతాలు వారపు మార్కెట్ కాంప్లెక్స్‌లలో, పోలీసులు వాంటెడ్ నక్సలైట్లను గుర్తించే బ్యానర్లు పోస్టర్లను వారి ఛాయాచిత్రాలు పేర్లతో సహా ఏర్పాటు చేశారు. నక్సలైట్ల గురించి సమాచారం అందించమని గ్రామస్తులను ప్రోత్సహించడానికి, సమాచారం అందించే ఎవరికైనా పోలీసులు బహుమతిని ప్రకటించారు. బ్యానర్లలో అధికారుల మొబైల్ నంబర్లు కూడా ఉన్నాయి, తద్వారా గ్రామస్తులు పోలీసులకు నేరుగా మరియు సురక్షితంగా సమాచారాన్ని అందించగలరు.ఈ చొరవ నక్సలైట్ కార్యకలాపాలను అరికట్టి, గ్రామస్తుల భద్రతపై విశ్వాసాన్ని బలోపేతం చేస్తుందని అధికారులు చెబుతున్నారు. వారపు మార్కెట్ల వంటి రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోస్టర్లను అతికించడం వల్ల విస్తృత ప్రేక్షకులను చేరుకోవచ్చు. ప్రజల మద్దతుతో ఈ ప్రచారం ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించే దిశగా ఒక ప్రధాన అడుగుగా నిలుస్తుందని పోలీసులు విశ్వసిస్తున్నారు.



# కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 17, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాకు విచ్చేసిన మంత్రి కి ఇల్లందు క్రాస్ రోడ్ లో గల సింగరేణి గెస్ట్ హౌస్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐ డి ఓ సి కార్యాలయం లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు, అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ . ప్రజా పాలన దినోత్సవం తెలంగాణ చరిత్రలో గర్వ కారణమైన రోజు అని, 1948 సెప్టెంబర్ 17న హైదరాబాదు సంస్థానం భారతదేశంలో కలిసిన చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేస్తుందన్నారు, స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులు, ప్రజా పోరాట యోధుల త్యాగం ఫలితం వలన నేడు ప్రజాస్వామ్య విలువలు స్థిరపడ్డాయి అన్నారు, ప్రజాస్వామ్యం అంటే ప్రజలే పాలకులు, ప్రజలే అధిపతులు అనే స్ఫూర్తిని నేడు అందరికీ గుర్తు చేస్తుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దార్శనిక నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల అన్నారు ,విద్యుత్తు, నీటిపారుదల, వ్యవసాయం, పరిశ్రమలు, ఐటీ, ఉపాధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు ,ఇందిరమ్మ ప్రజా పాలనలో ప్రజల హక్కులు కాపాడబడుతున్నాయని, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా వంటి పథకాల ద్వారా రైతు సంక్షేమానికి తెలంగాణ కేరాఫ్ గా నిలిచిందని అన్నారు, జిల్లాలో జరిగిన అభివృద్ధి పై మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ తో నీటి కల నెరవేరిందని, ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ స్థాపనతో జిల్లాకు ఖ్యాతి తెచ్చిందని, భద్రాచలానికి రాకపోకల సౌకర్యం కల్పించేలా రైల్వే లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, రింగ్ రోడ్, బైపాస్ రోడ్, నేషనల్ హైవే పనులు కూడా ప్రగతిలో ఉన్నాయన్నారు, సింగరేణి సంస్థను బలోపేతం చేయడం, భవిష్యత్ లో థర్మల్ సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం కోసం ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు, మంత్రి వెంట జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో పాటు అదనపు కలెక్టర్ వేణుగోపాల్, విద్యా చందన , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# దమ్మపేట మండలంలో పర్యటించిన మంత్రి తుమ్మల ,ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, సెప్టెంబర్ 17 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,దమ్మపేట మండలంలో అభివృద్ధి పనుల పరంపర కొనసాగుతోంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని ప్రజల్లో ఉత్సాహం నింపారు. గండుగులపల్లి ఏఖలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన వారు విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన కాంపౌండ్ వాల్, స్టాఫ్ రూమ్స్, బాయ్స్ హాస్టల్, అదనపు తరగతి గదుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతున్న అడ్వాంట్ కంపెనీ వారు అందించిన కంప్యూటర్ ల్యాబ్, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆధునిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. తరువాత పట్వారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ యూనిట్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా అవకాశాలు పెంపొందించడం ద్వారా విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయవచ్చని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్లకు నూతన వస్త్రాలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెండు మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానిక ప్రజలు అభివృద్ధి పనుల పట్ల సంతోషం వ్యక్తం చేసి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలి

- పాఠశాల స్థాయి జోనల్ క్రీడల ముగింపు సమావేశంలో భద్రాచలం ఏ ఎస్ పి



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 17, ప్రజా జ్యోతి:** విద్యతోపాటు విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. భద్రాచలం గత రెండు రోజులపాటు జరిగిన పాఠశాల స్థాయి జోనల్ క్రీడలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, ప్రణాళికతో కృషి చేస్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చని సూచించారు. చిన్ననాటి నుంచే విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని హితవు పలికారు. అనంతరం ఎంఈఓ తోటమల్ల రమ, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ నరేష్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయని, జోనల్ స్థాయిలో గెలిచిన వారు జిల్లా స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. జగదీష్‌కాలనీ హెచ్ఎం రాజా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని వివరించారు. అనంతరం ఏఎస్పి , ఎంఈఓ, ఇతర అతిథులు విజేతలకు షీల్డ్లు, సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్య పాఠశాల ప్రిన్సిపల్ సాయి, పీడీలు సుజాత, రమేష్, రాంబాబు, పామర్తి, హరికృష్ణతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. జోనల్ గేమ్స్ విజయవంతం కావడానికి సహకరించిన ప్రైవేట్ పాఠశాలల సంఘ ప్రతినిధులు, అతిథులందరికీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు జెట్టి పద్మ కృతజ్ఞతలు తెలిపారు.

# పి వై ఎల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన

- వైద్యరంగం లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలని భర్తీ చేయాలి
- ప్రైవేట్ హాస్పిటల్ దోపిడీని అరికట్టాలి.
- ఇల్లందు లో మెడికల్ కాలేజిని ఏర్పాటు చేయాలి




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 17, ప్రజాజ్యోతి:** వైద్య రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఇల్లందు పట్టణంలో ఒక మెడికల్ కాలేజ్ అని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల యువజన సంఘం( పివైఎల్ ) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు, అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో నీ సంబంధిత అధికారులకు అందజేశారు, అనంతరం జరిగిన సమావేశంలో పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ళ రమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పర్షిక రవి, నోముల భానుచందర్ లు మాట్లాడుతూ కొత్తగూడెం జిల్లా లో ఖాళీగా ఉన్న డాక్టర్, నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, పార్మాసిస్ట్ ఉద్యోగాలని వెంటనే భర్తీ చేయాలనీ, సీజనల్ వ్యాధులను నివారించాలని, ప్రైవేట్ హాస్పిటల్ దోపిడీ ని నివారించాలని, గ్రామీణ ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని , నూతన పీహెచ్సి లను ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు, అదేవిధంగా ఇల్లందు లో వంద పడకల ఆసుపత్రి ని వెంటనే పూర్తి చేయాలనీ, ఇల్లందు కు ఒక మెడికల్ కాలేజీ ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు పి వై ఎల్ జిల్లా అధ్యక్షుడు చింత నరసింహా రావు ఆధ్వర్యంలో నిర్వహించిన.ఈ కార్యక్రమం లో ప్రగతిశీల యువజన సంఘం కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి మోతిలాల్, రావూరి ఉపేందర్, తాటి రమేష్ బానోత్ వినోద్ తదితరులు పాల్గొన్నారు

# సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అమరజీవి కామ్రేడ్ సోయం గంగులుకు ఘన నివాళి



**దమ్మపేట, సెప్టెంబర్ 17 (ప్రజాజ్యోతి):** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవం ముగింపు సందర్భంగా దమ్మపేట మండలం,జమీదార్ బంజర్ గ్రామంలో అమరజీవి కామ్రేడ్ సోయం గంగులు స్మారక స్థూపం వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సభ జరిగింది. మండల కార్యదర్శి మొరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీనియర్ నాయకుడు దొడ్డ లక్ష్మీనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించగా, జిల్లా కమిటీ సభ్యుడు పిట్టల అర్జున్ రావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పిట్టల అర్జున్‌రావు మాట్లాడుతూ, 1944–52 సంవత్సరాల మధ్య జరిగిన వీర తెలంగాణ రైతాంగ పోరాటం ప్రపంచ చరిత్రలోనే గొప్ప పోరాటమని, 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచబడిందని, ఈ పోరాటాన్ని బిజెపి,ఆర్ఎస్ఎస్ వక్రీకరించే ప్రయత్నం తగదు అని స్పష్టం చేశారు.కామ్రేడ్ సోయం గంగులు పేదల తరపున జమీందారులపై పోరాడిన మన్యం పులి, మన్యం వీరుడు అని ఆయన ఘనంగా స్మరించారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రావుల శోభన్ బాబు, మొరంపూడి కేశవరావు, కొప్పుల శ్రీనివాసరావు, సిహెచ్ బ్రహ్మయ్య, మురహరి రఘు, ఎస్.కె. నభి, సోరపు వెంకటేశ్వరరావు, మడకం నాగేంద్ర, అరుణ, రావూరి బ్రహ్మం, మోడీ కాంతమ్మ, మోడియం మరియమ్మ, కనితి రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నిజాం రాచరికం నుండి విముక్తే జాతీయ సమైక్యత దినోత్సవం: మాజీ ఎమ్మెల్యే



**ఇల్లందు, సెప్టెంబర్ 17, ప్రజాజ్యోతి:** నిజాం రాచరికం నుండి విముక్తే జాతీయ సమైక్యత దినోత్సవమని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక జెకె కాలనీలో గల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశత్వ, రాచరిక పరిపాలనకు తెర పడిన రోజు అని అన్నారు. రెండు శతాబ్దాలుగా వంశపారపర్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని ఏలి తెలంగాణ ప్రజానీకాన్ని కట్టు బానిసలుగా చేసిన నిజాం నిరంకుశత్వానికి ప్రజలు చరమగీతం పాడిన చారిత్రాత్మక రోజు అని గుర్తు చేశారు. . భూమి, భుక్తి, తెలంగాణ ప్రాంత విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఎన్నోవేల మంది తమ ప్రాణాలు కోల్పోయారని, తెలంగాణ స్వేచ్ఛ వాయువుల కోసం అమరులైన అమరులను స్మరించుకున్నారన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా పోలీసులతో పరిపాలన చేపిస్తూ నిజాం ప్రభుత్వాన్ని కళ్ళకు కట్టినట్టుగా చూపిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంలో కనీసం ప్రశ్నించే హక్కు కూడా లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జెకె శ్రీను, లలితా శారదా, కడకంచి పద్మ, వాంకుడోత్ తార, నాయకులు సిలివేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, లకావత్ దేవిలాల్ నాయక్, ఖమ్మంపాటి రేణుక, లాల్ సింగ్, కొక్కు సరిత, కడగళ్ల నారాయణమ్మ, బండారి శ్రీను, డేరంగుల పోశం, ఘాజీ, గిన్నారపు రాజేష్, సత్తాల హరికృష్ణ, కాసాని హరిప్రసాద్ యాదవ్, నీలం రాజశేఖర్, సురేష్, రవి కాంత్, చాంద్ పాషా, వార రమేష్, పుందూరి లక్ష్మీనారాయణ, కిషన్ నాయక్, పాబోలు కిరణ్, కడగంచి వీరస్వామి, బిప్పిన్ నాయక్, వీరభద్రం, కందుల రఘువీర్ రెడ్డి, మిర్జాబేగ్, దుంపటి కృష్ణ, కుంట నవాబ్, బజారు సత్యనారాయణ, సువర్ణపాక రామయ్య, మంకిని కృష్ణ, తాటి మౌనిక, ఉపసర్పంచ్ యాకుబ్బి, జోగా రామకృష్ణ, వాంగు డోత్ మల్సూర్, చింతల పద్మ, బండ పోశం, గని శ్రీహరి, ఎర్రం కుమార్, ఎర్రం నవీన్, లోడంగి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## సారపాకలో పీఎం నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు



**బూర్గంపహాడ్, సెప్టెంబర్17 (ప్రజా జ్యోతి ):** మండలంలోని సారపాక ప్రధాన కూడలి నందు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఏనుగు వెంకటరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు సాయి శ్రీను, భూక్య వెంకట్ , బానోతు వెంకట్ , రవి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాండురంగ భజనమందిరములో ధ్వజస్తంభం ఏర్పాటు

- 1,51,116 రూపాయలు విరాళంగా ఇచ్చిన సంకా వెంకటేశ్వరరావు





**కొత్తగూడెం, సెప్టెంబర్ 17 (ప్రజాజ్యోతి ):** శ్రీ పాండురంగ భజన మందిరం కొత్తగూడెం శ్రీ పర్వత వర్ధిని, శ్రీరామలింగేశ్వర స్వామి వారి దేవాలయం పునర్నిర్మాణంలో భాగంగా స్వామి వారికి నూతన రాతిధ్వజస్తంభమని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ ధ్వజస్తంభమునకు సంకా వెంకటేశ్వరరావు 151116 రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఇంకా భక్తులు ఆలయ నిర్మాణం కోసం దాతలు ముందుకు వచ్చి వారి శక్తి మేర విరాళాలు ఇచ్చి ఆలయ అభివృద్ధికి తోడ్పడి,స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ అర్చకులు కోరారు.

## సాయుధ అమరుల త్యాగం.. తెలంగాణ విమోచనం

- కరెంటు లేదు, రోడ్డు లేదు,నీళ్లు లేవు
- స్వతంత్ర భారతములో ఆదివాసీల బతుకులు అగమ్య గోచరం



**పినపాక, సెప్టెంబర్ 17(ప్రజాజ్యోతి ):** ఎందరో తెలంగాణ సాయుధ పోరాట వీరుల కృషి ఫలితంగా నేడు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, మణుగూరుకు చెందిన సామాజిక కార్యకర్త అడ్వకేట్ కర్నె రవి అన్నారు. బుధవారం కరకగూడెం మండలం కన్నాయిగూడెం పంచాయతీలోని ఆదివాసీ గ్రామం అంగూరి గూడెం గ్రామంలో కర్నె రవి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించి తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగధనులు మహానుభావులు తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించి తమ ప్రాణ త్యాగం చేసి, రాష్ట్రాన్ని సాధించి పెట్టారని అన్నారు. గ్రామంలోని ఆదివాసీల సమస్యలు నేటికీ పరిష్కారం కాకుండా అలాగే ఉన్నాయని అన్నారు. గ్యాస్ సౌకర్యం, కరెంటు సౌకర్యం, రోడ్డు సౌకర్యం లేకుండా ఆదివాసులు ఇబ్బంది పడుతున్న ఎమ్మెల్యేలు ఎంపీలు ఏమి పట్టించుకోకుండా పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. అంగూరి గూడెం గ్రామానికి రోడ్డు సౌకర్యం, కరెంటు వచ్చినప్పటికీ, స్థానిక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు నిర్లక్ష్యం అధికారులు అశ్రద్ధా చేస్తున్నారు అన్నారు. అతి త్వరలోనే గ్రామానికి రోడ్డు కరెంటు నీళ్ల సౌకర్యం కల్పిస్తానని కర్నె రవి గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

# పదేళ్ల పాలనలో దోచుకున్న దొంగలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

- ప్రజా పాలనలో పేదలకు సంక్షేమ పథకాల జాతర
- పినపాక పర్యటనలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**పినపాక, సెప్టెంబర్ 17(ప్రజాజ్యోతి ):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన పేదలను గుర్తించి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పినపాక మండల పర్యటన లో భాగంగా ఎల్చిరెడ్డిపల్లి, ఏడూళ్ల బయ్యారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎల్చిరెడ్డిపల్లి ,ఏడూళ్ల బయ్యారం కాంగ్రెస్ పార్టీ నాయకులు 300 బైక్లతో భారీ ర్యాలీ తీస్తూ ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో సంక్షేమ పథకాల జాతర నడుస్తుందన్నారు. అభివృద్ధి పథకాలను చూసే పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అత్యంత పారదర్శకంగా అర్హులను గుర్తించి అందజేస్తున్నామని అన్నారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3500 ఇళ్లతో పాటు మరో వెయ్యి ఇండ్లు అదనంగా ఇచ్చామని మరో 1500 ఇండ్లు రాబోతున్నాయన్నారు. నియోజకవర్గానికి 6000 ఇండ్లు రాబోతున్నాయని తెలిపారు.. అలాగే ఉచిత బస్ ప్రయాణం ,200 యూనిట్ల ఉచిత కరెంటు ,500 కే వంట గ్యాస్, రైతు భరోసా రుణ మాఫీ ధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ వంటి పథకాలతో దేశంలోనే ఏ రాష్ట్రం ఏ రాష్ట్రంలోనూ ఇవ్వనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణలో ఇస్తున్నామన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేకనే ప్రతిపక్ష బిఆర్ఎస్ కుటుంబ డ్రామాకు తెర లేపిందని, యూరియా కొరతను కేంద్రం కావాలని సృష్టిస్తే బీఆర్ఎస్ కేంద్రంలోని బిజెపిని నిలదీయకుండా రాజకీయాలకు వాడుకుంటుందన్నారు. బీఆర్ఎస్ చమకబారు ఎత్తుగడలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధికి టిఆర్ఎస్ కల్వకుంట్ల కుటుంబ అవినీతి పాలనకు మధ్యనే అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుతున్న దొంగలకు ప్రజల దగ్గరకి వెళ్లి ఓట్లు అడిగే హక్కు లేదని, ఏ మొహం పెట్టుకుని గ్రామాలకు వస్తారు నిలదీయాలన్నారు. బిజెపి బీఆర్ఎస్ వి దొంగ దోస్తీ అని, వారి మధ్య బడే భాయ్ చోటే బాయ్ లా చీకటి ఒప్పందాలని ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల రామనాథం, నాయకులు గంగిరెడ్డి వెంకట రెడ్డి, లక్ష్మిరెడ్డి, పేరం వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, దాట్ల రాజేష్, తోలెం కళ్యాణి, కల్లాకుల బుచ్చిబాబు, అర్జున్, మధు రెడ్డి, గీద సాయి, బండారు సాంబ, పొనగంటి మల్లయ్య, బోడ రమేష్, కొప్పుల వీరస్వామి, బూర బతకయ్య, చీకటి సత్యనారాయణ, కే శ్రీను, యాలం బుజ్జి బాబు, కే లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభకు మెరిసిన తెలుగు భాషా దినోత్సవం





**భద్రాచలం, సెప్టెంబర్ 17,ప్రజాజ్యోతి :** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టిఎల్ఎం మేళాతో పాటు తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గిరిజన భవనంలో మంగళవారం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. వ్యాసరచన, ఒక నిమిషం వ్యాఖ్యానం, ఏకపాత్రాభినయం, కవితలు, నాటక పోటీలలో విద్యార్థులు మెరిసారు. దాదాపు 120 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మాట్లాడుతూ, "గెలుపు—ఓటములు సహజం. ఓటమి చెందితే నిరుత్సాహపడకుండా మళ్లీ గెలుపు కోసం కృషి చేయాలి" అన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని, ఉపాధ్యాయులు రూపొందించిన టిఎల్ఎం కళాఖండాలు ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. పోటీల్లో ప్రణీత, సౌజన్య, మేఘన, ఇందు, సత్యానిక, వర్షిత బిందు, జశ్విత, సుచిత్ర, ఉపేంద్ర, అశ్విత, అవంతి, భార్గవి తదితరులు విజేతలుగా నిలిచారు. టిఎల్ఎం మేళా విభాగంలో అనసూయ, భారతి, రాములు, నాగరాజు, సుధీర్ కుమార్, పున్నారావు, రామకృష్ణ, భాస్కర్ రావు, కృష్ణకుమారి, రమేష్, రఘునందనరావు ప్రతిభ కనబరిచారు. విజేతలకు 1000 నుండి 5000 రూపాయల వరకు నగదు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, ఎస్ఓ భాస్కరన్, ఏసీఎంఓ రాములు, రమేష్, ఏటిడివోలు అశోక్ కుమార్, రాధమ్మ, జిసిడివో అలివేలు మంగతాయారు, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లాన్ టెన్నిస్‌తో ఆరోగ్యమే లక్ష్యం : ఐటిడిఏ పీఓ రాహుల్



**భద్రాచలం, 17 సెప్టెంబర్ ,ప్రజాజ్యోతి :** పగలంతా కార్యాలయ పనుల్లో అలసట చెంది ఉన్న ఉద్యోగులు ఆటవీడుపుగా టెన్నిస్ క్రీడ ఆడితే శారీరక, మానసికంగా ఎంతో మేలు కలుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.బుధవారం ఐటిడిఏ ప్రాంగణంలోని నివాస గృహాల సముదాయంలో కొత్తగా నిర్మించిన లాన్ టెన్నిస్ కోర్టును ప్రారంభించి స్వయంగా టెన్నిస్ ఆడిన అనంతరం ఆయన మాట్లాడుతూ – చిన్నారుల నుండి వృద్ధుల వరకు టెన్నిస్ క్రీడ ఆడితే వ్యాయామంతో పాటు ఉత్తేజం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ కనీసం ఒక గంట పాటు క్రమం తప్పకుండా క్రీడలో పాల్గొంటే రక్త ప్రసరణ సక్రమంగా జరిగి శరీరానికి ఉల్లాసం చేకూరుతుందని అన్నారు.క్రీడాకారులు గ్రౌండ్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారం పడేయరాదని ఆయన సూచించారు. అలాగే నివాస గృహాల్లో కూడా శుభ్రత పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, జిసిడిఓ అలివేలు మంగతాయారు, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, ఏఎస్ఓ నాగేశ్వరరావు, మేనేజర్ ఆదినారాయణ, పీడీలు వెంకటేశ్వర్లు, హరికృష్ణ, ఈశ్వర్, మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.